

సీఎం జగన్ రాక రేపు



విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విశాఖ రానున్నారు. భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలస వద్ద నిర్వహించే పార్టీ ఉత్తరాంధ్ర సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఇక్కడ నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారు. సీఎం గన్నవరం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకుంటారు. ఇక్కడి నుంచి హెలీకాప్టర్‌లో సంగివలస వెళతారు. 3.30 గంటల నుంచి ఐదు గంటల వరకూ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడతారు.

ప్లాన్‌కు పాతర!

అనకాపల్లిలో అడ్డగోలుగా భవన నిర్మాణాలు!



మెయిన్ రోడ్డులో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనం



న్యూకాలనీలో తక్కువ సెట్‌బ్యాక్‌తో నిర్మిస్తున్న వాణిజ్య భవనం



గాంధీనగర్‌లో గతంలో ఫిర్యాదులు అందినా ఆగని అక్రమ నిర్మాణం

సెట్ బ్యాక్ నిబంధనలకు తూట్లు

- ప్లాన్ ప్రకారం ఖాళీ స్థలం వదలని బిల్డర్లు
- కొన్నిచోట్ల డ్రైనేజీ కాలువలపైనే భవన నిర్మాణం
- వాణిజ్య అవసరాలకు సెల్లార్ల వినియోగం
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, మామూళ్లే కారణమని ఆరోపణలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంతోపాటు జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన నిబంధనలను తుంగలో తొక్కి, యథేచ్ఛగా వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆయా నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. భవన నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో మామూళ్లు తీసుకుంటూ, అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనకాపల్లి పట్టణంతోపాటు జీవీఎంసీ జోనల్ కార్యాలయం పరిధిలోని కొప్పాక, రాజుపాలెం, సాలాపువానిపాలెం, వల్లూరుల్లో అక్రమ భవన నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అనకాపల్లిలో పలుచోట్ల జరుగుతున్న బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు.. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా సాగుతున్నాయి. ప్లాన్‌లో ఒకరకంగా వుంటే, క్షేత్రస్థాయిలో భవన నిర్మాణం మరోవిధంగా వుంటున్నది. కొన్నిచోట్ల ఎటువంటి అనుమతులు లేకుండానే అదనపు అంతస్థులు నిర్మిస్తున్నారు. ఇదంతా టౌన్ ప్లానింగ్ అధికారులకు, సిబ్బందికి తెలిసినప్పటికీ రాజకీయ జోక్యం కారణంగా అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లడం లేదు.

నిబంధనలు గాలికి... అంతస్థులు పైపైకి...

అనకాపల్లి పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పలువురు జీ+1, జీ+2 నిర్మాణాలకు అనుమతి పొంది మూడు, నాలుగు అంతస్థులు నిర్మిస్తున్నారు. భవనం చుట్టూ నిర్ణీత వెడల్పుతో ఖాళీ స్థలం (సెట్ బ్యాక్) వదలాలి. కానీ ఎటువంటి స్థలం వదలకుండా సరిహద్దుల వరకు భవనాలు నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వీలుగా నిర్మాణాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం బహుళ అంతస్థుల భవనాల మెట్లను 1.25 మీటర్లకు తగ్గకుండా వెడల్పు వుండేలా నిర్మించాలి. కానీ చాలా భవనాలు మూడు అడుగుల వెడల్పు మాత్రమే వుంటున్నాయి. నూతన భవన నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్లాన్‌కు విరుద్ధంగా పనులు జరుగుతుంటే అధికారులు అడ్డుకోవాలి. కానీ ఇక్కడ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. మెయిన్ రోడ్డు పక్కనే సెంటున్నర స్థలం ఏకంగా మూడు అంతస్థులతో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు భవన నిర్మాణదారులు డ్రైజీనే కాలువలు, ఫుట్‌పాత్‌లను ఆనుకొని భవన నిర్మాణాలు జరుపుతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. జీవీఎంసీ అధికారులు ఆయా భవన నిర్మాణదారుల నుంచి మామూళ్లు తీసుకుని, మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి.

అనకాపల్లి గాంధీనగర్‌లో అధికార పార్టీకి చెందిన ఒక నేత జీవీఎంసీ సిబ్బంది నివాస గృహాల స్థలంలో బహుళ అంతస్థుల భవన నిర్మాణ పనులు చేపట్టినా అధికారులు పట్టించుకోలేదు. ఎన్టీఆర్ స్టేడియంకు ఎదురుగా న్యూకాలనీలో ఒక వ్యక్తి జీవీఎంసీ కాలువను ఆనుకొని బహుళ అంతస్థుల భవనం నిర్మిస్తున్నారు. దీనికి జీవీఎంసీ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. పట్టణంలోనే కాకుండా జీవీఎంసీ పరిధిలోని సిరసపల్లి, కొత్తూరు, కొండకొప్పాక గ్రామాల్లో కూడా నిబంధనలు అతిక్రమించి భవన నిర్మాణాలు సాగుతున్నాయి.

ఆన్‌లైన్ అనుమతుల మాటున...

గతంలో జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నేరుగా ఇంటి ప్లాన్ జారీ చేసేవారు. ఈ క్రమంలో అక్రమాలు జరుగుతుండడంతో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అంతవరకు బాగానేవున్నా.. అనుమతులు మంజూరులో అక్రమాలు మాత్రం ఆగలేదు. లైసెన్స్ పొందిన కొందరు ప్రైవేటు సర్వేయర్లు ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతుల్లో నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణను వివరణ కోరగా, టౌన్ ప్లానింగ్ ఫైళ్లు కమిషనర్ వద్దకు రావని, అక్రమ నిర్మాణాలు జరిగినట్టు ఫిర్యాదులు అందితే టౌన్ ప్లాన్ విభాగానికి పంపుతామన్నారు.

మళ్లీ అదే తీరు!

తుది ఓటరు జాబితాల్లోనూ తప్పుల తడకలు


- పలు గ్రామాల్లో డబుల్ ఎంట్రీలు
- ఓటరు ఫొటోకు బదులు బాలుడి ఫొటో
- డోర్ నంబరు స్థానంలో పోలీసు స్టేషన్!
- చిత్రవిచిత్రాలతో విడుదల చేసిన అధికారులు

పరవాడ, జనవరి 25:

ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ సక్రమంగా జరిగినట్టు కనిపించడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో ఒక్కో వ్యక్తికి రెండేసి చోట్ల ఓట్లు వుండడం దీనిని బలపరుస్తున్నది. సుమారు ఆరు నెలలపాటు శ్రమించినప్పటికీ తప్పులు లేకుండా ఓటరు జాబితాలను రూపొందించడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు ఓటర్ల నుంచి వినిపిస్తున్నాయి. ఓటరు జాబితాల్లో డబుల్ ఎంట్రీలు, స్పష్టంగా కనిపించని ఫొటోలు, ఇంటి నంబర్ల తప్పులు కోకొల్లలుగా వున్నాయి.



పోలింగ్ కేంద్రం 230లో వరుస సంఖ్య 1,134, పోలింగ్ కేంద్రం 231లో వరుస సంఖ్య 883లో రెండు ఓట్లు వున్న గొంప శర్వాణి



పోలింగ్ కేంద్రం 231లో వరుస సంఖ్య 17తోపాటు 1,142లో ఓట్లు వున్న గుదే సూరిబాబు

పరవాడ పోలింగ్ కేంద్రం 230లో వరుస సంఖ్య 1,134 (ఎపిక్ కార్డు నంబర్ ఎక్స్‌జేవీ 2042158)తోపాటు పోలింగ్ కేంద్రం 231లో వరుస సంఖ్య 883లో (ఎపిక్ కార్డు నంబర్ ఎక్స్‌జేవీ2143303) గొంప శర్వాణికి ఓట్లు వున్నాయి.

పోలింగ్ కేంద్రం 231లో వరుస సంఖ్య 17 (ఎపిక్ కార్డు నంబర్ ఎక్స్‌జేవీ2904050. వయసు 55గా వుంది. తండ్రి పేరు కాలమ్‌లో 'ఇతరులు' అని వుంది), వరుస సంఖ్య 1,142లో (ఎపిక్ కార్డు నంబర్ ఎక్స్‌జేవీ1431220) గుదే సూరిబాబుకు రెండు ఓట్లు ఉన్నాయి. అయితే సూరిబాబు పేరు ఒక చోట సూర్యనారాయణగా, మరో చోట సూరిబాబుగా నమోదైంది.

బండారు అప్పలనాయుడు అనే వ్యక్తికి పోలింగ్ కేంద్రం 229లో వరుస సంఖ్య 1,253, ఇదే పోలింగ్ కేంద్రంలో వరుస సంఖ్య 1,255తో ఓట్లు ఉన్నాయి.

ఇంటి నంబరు 'పరవాడ ఆఫ్ పోలీస్‌స్టేషన్!'

పరవాడ పోలింగ్ కేంద్రం 228, వరుస సంఖ్య 994లోని ఓటరు గదం బాలాజీకి చెందిన ఫొటో బదులు గుర్తు తెలియని బాలుడి ఫొటో వుంది. బాలాజీ తండ్రి పేరు వద్ద 'ఫాదర్స్ ఫ్రెండ్స్' అని, డోర్ నంబరు స్థానంలో 'పరవాడ ఆఫ్ పోలీస్‌స్టేషన్' అని వుంది.

జిల్లాలో పది మంది ఎస్‌ఐలు బదిలీ

అనకాపల్లి రూరల్, జనవరి 25: జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలుగా పనిచేస్తున్న పది మందిని బదిలీ చేస్తూ ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.రాయవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పి.ప్రసాదరావును మునగపాకకు, ఇక్కడ పనిచేస్తున్న ఎం.అలీ షరీఫ్‌ను అనకాపల్లిటౌన్‌కు బదిలీ చేశారు. సబ్బవరంలో పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణను కె.కోటపాడుకు, నక్కపల్లిలో పనిచేస్తున్న ఎ.విభీషణరావును ఎస్.రాయవరానికి, అనకాపల్లిటౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న డి.వెంకన్నను డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌కు, అనకాపల్లి రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సీహెచ్.నరసింగరావును నేషనల్ హైవే స్క్వాడ్‌కు, పరవాడలో పనిచేస్తున్న జి.తేజేశ్వరరావును అనకాపల్లి రూరల్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో వున్న కె.రమేశ్‌బాబును కశింకోటలో, శ్యామలరావును పరవాడలో, ఎస్.సోమశేఖరరావును అనకాపల్లి ట్రాఫిక్ స్టేషన్‌లో నియమించారు.

580 మంది ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు

- నేడు గణతంత్ర దిన వేడుకల్లో అందజేయనున్న కలెక్టర్



ఎన్టీఆర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు

అనకాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 580 మంది ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేయనున్నారు. ఈ మేరకు ఆయా పురస్కార గ్రహీతలకు కలెక్టరేట్ నుంచి సమాచారం పంపారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో పలు శాఖల హెచ్‌ఓడీలతోపాటు రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.



కొత్తబయపురెడ్డిపాలెం రోడ్డులో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు (ఫైల్ ఫొటో)



అవే గృహాలకు వైసీపీ రంగులు వేసిన దృశ్యం

సొంత గూడు ఒనగూరదా!?

టిడ్కో ఇళ్ల కోసం ఐదేళ్ల నుంచి లబ్ధిదారులు నిరీక్షణ

- టీడీపీ హయాంలోనే 60 శాతం నిర్మాణాలు పూర్తి
- వైసీపీ అధికారంలోకి వచ్చి 56 నెలలు కావస్తున్నా పూర్తికాని వైనం
- కొనసా..గుతున్న మౌలిక సదుపాయాల పనులు
- జనవరి 25వ తేదీలోగా లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తామన్న టిడ్కో చైర్మన్
- గడువు దాటినా అమలుకాని హామీ
- వచ్చే నెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్?
- టిడ్కో ఇళ్ల పంపిణీపై లబ్ధిదారుల్లో సందిగ్ధం

నర్సీపట్నం, జనవరి 25:

మునిసిపాలిటీలో నిరుపేదల సొంతింటి కల ఎప్పటికి సాకారం అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. టిడ్కో లబ్ధిదారులకు ఈ నెలలోనే ఇళ్లను పంపిణీ చేస్తామన్న పాలకులు, అధికారుల మాటలు ఆచరణలో అమలు కాని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహ సముదాయాల నిర్మాణ పనులను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన వైసీపీ పాలకులు.. మౌలిక సదుపాయాల కల్పనలో కూడా జాప్యం చేస్తున్నారు. దీంతో టిడ్కో ఇళ్లను ఎన్నికల్లోపు అందజేసే పరిస్థితి లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న తాగునీటి ట్యాంకు నిర్మాణం

తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు నర్సీపట్నం మునిసిపాలిటీలో ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా గృహాల నిర్మాణం కోసం బలిఘట్టం దత్తాత్రేయ ఆశ్రమం సమీపంలో 12 ఎకరాలు, కొత్త బయపురెడ్డిపాలెం- కసిమి రోడ్డులో 12 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వీరిలో 2,448 మందిని అర్హులుగా అధికారులు ఎంపిక చేశారు. 300, 360 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ల నిర్మాణాలు చేపట్టారు. 2019లో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి ముందు 60 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో 1,480 మందికి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరో 968 మందికి మంజూరు పత్రాలు ఇచ్చారు. అయితే పునాదుల స్థాయిలో ఉన్న 624 ఫ్లాట్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. వీరికి జగనన్న కాలనీలలో స్థలాలు కేటాయించారు. మిగిలిన 1,824 ఫ్లాట్లలో 384 సింగిల్ బెడ్ రూమ్ (300 చ.అ.) ఫ్లాట్లను లబ్ధిదారులకు ఉచితంగా ఇచ్చారు. మిగిలిన 1,440 ఫ్లాట్లలో... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

సమస్యల పరిష్కారానికి పెన్షనర్లు ధర్నా

దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు గురువారం జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. 11వ పీఆర్సీలో తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను తిరిగి పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 11వ పీఆర్సీ అరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని రకాల వ్యాధులకు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు.

రాజయ్యపేటలో విషాదం

- సెప్టిక్ ట్యాంకు నిర్మాణానికి గొయ్యి తీస్తుండగా భారీ మొత్తంలో జారిపడిన ఇసుక
- ఊపిరాడక కూలీ మృతి



మృతుడు రంగాల జగదీశ్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, జనవరి 25:

మండలంలోని రాజయ్యపేట మత్స్యకార గ్రామంలో గురువారం విషాదం అలముకుంది. సెప్టిక్ ట్యాంకు నిర్మాణానికి గొయ్యి తీస్తుండగా పైనుంచి ఇసుక పడిపోవడంతో సజీవ సమాధి అయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

రాజయ్యపేట గ్రామానికి చెందిన రంగాల జగదీశ్ (28) కుటుంబ పోషణ కోసం పలు రకాల కూలి పనులకు వెళుతుంటాడు. గురువారం గ్రామంలో ఒక ఇంటి వద్ద సెప్టిక్ ట్యాంకు కోసం గొయ్యి తీసే పనికి వెళ్లాడు. సముద్ర తీర గ్రామం కావడంతో నేల మొత్తం ఇసుకతో నిండివుంటుంది. కాగా జగదీశ్ కొంతమేర గొయ్యి తవ్విన తరువాత అన్ని వైపుల నుంచి ఇసుక జారిపోయి గోతిలో పడిపోయింది. ప్రమాదం నుంచి బయటపడడానికి అతను చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి. పూర్తిగా ఇసుకలో కూరుకుపోయాడు. ఇది గమనించిన స్థానికులు కేకలు పెద్ద ఎత్తున గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ విభీషణరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను రప్పించి ఇసుకను తొలగించి జగదీశ్‌ను బయటకు తీశారు. కానీ అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. కాగా జగదీశ్‌కు భార్య లోకేశ్వరి, రెండేళ్ల కుమార్తె వున్నారు. అంతేకాక ఆమె ఇప్పుడు నాలుగు నెలల గర్భవతి. మట్టి పనులకు వెళ్లిన తన భర్త.. అర్ధంతరంగా మట్టిలో కలిసిపోయాడంటూ ఆమె బోరున విలపించింది. కాగా ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

క్రైం... crime news

యువతిపై గ్రామ వలంటీర్ అత్యాచారయత్నం

- విషయం బయటకు చెబితే సంక్షేమ పథకాలు ఆపేస్తానని బెదిరింపు
- గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- నిందితుడి అరెస్టు


వలంటీర్ శివరాజ్

గొలుగొండ, జనవరి 25: ఓ గ్రామ వలంటీర్ తనపై అత్యాచార యత్నం చేయడంతో పాటు చంపుతానని బెదిరించాడని అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలానికి చెందిన యువతి బుధవారం అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ నారాయణరావు గురువారం తెలిపిన వివరాలివి. చోద్యం గ్రామానికి చెందిన యువతి డిగ్రీ చదువుకుంది. బుధవారం ఎస్.రాయవరం మండలం రేవుపోలవరంలో ఏర్పాటుచేసిన పదో తరగతి బ్యాచ్ సమ్మేళనానికి ఆమె హాజరైంది. సాయంత్రం అక్కడి నుంచి తిరుగు ప్రయాణమైంది. గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థి బైక్‌పై ఇంటికి వెళుతుండగా రాత్రి ఏడు గంటల సమయంలో చోద్యం గ్రామ వలంటీర్ మెసర శివరాజ్ గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామ సమీపంలో అడ్డగించి, పక్కనే ఉన్న తుప్పల్లోకి లాక్కెళ్లి తనపై అత్యాచారం చేయబోయాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అతడి నుంచి తప్పించుకుని తాను ఇంటికి చేరుకున్నానని వెల్లడించింది. ఈ విషయం బయటకు చెపితే చంపేస్తానని బెదిరించాడని, ఆమె తల్లికి వస్తున్న సంక్షేమ పథకాలను కూడా నిలిపివేస్తానని వలంటీర్ బెదిరించాడని బాధితురాలు ఆ ఫిర్యాదులో పేర్కొందన్నారు. చోద్యం గ్రామ సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అడగర్ల అప్పలనాయుడు సహకారంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడు గ్రామ వలంటీరును అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బొగ్గు లారీ బోల్తా

పరవాడ, జనవరి 25: మండలంలోని రావాడ పంచాయతీ పరిధి సోమునాయుడుపాలెం సమీపంలో గల వంతెన వద్ద బొగ్గు లారీ గురువారం తెల్లవారుజామున బోల్తా పడింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ మండలం పాలవలస వద్ద గల హిందూజా పవర్‌ప్లాంట్‌కు బొగ్గును అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా సోమునాయుడుపాలెం సమీపంలో వంతెన వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి లారీ బోల్తా పడింది. అదృష్టవశాత్తూ డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనపై పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైరు పేలి.. అదుపు తప్పిన ఎంపీపీ కారు

- ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు


టైరు పేలడంతో ప్రమాదానికి గురైన కారు

కొయ్యూరు, జనవరి 25: కొయ్యూరు ఎంపీపీ ప్రయాణిస్తున్న కారు ముందు టైరు పేలడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నది. ఈ సంఘటలో ఎంపీపీ క్షేమంగానే వున్నప్పటికీ ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండల పరిషత్ అధ్యక్షుడు బడుగు రమేశ్‌బాబు గురువారం మధ్యాహ్నం ఇక్కడ కార్యాలయంలో పనులు ముగించుకుని కారులో నర్సీపట్నం బయలుదేరారు. గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం వద్ద కారు ముందు టైరు పేలింది. దీంతో కారు అదుపు తప్పి ఎదురుగా నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వస్తున్న ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి.

మట్టి అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడులు

- రెండు లారీలు, ఒక ఎక్స్‌కవేటర్ స్వాధీనం

పరవాడ, జనవరి 25 : మండలంలోని పెదముషిడివాడ పంచాయతీ పరిధిలో మట్టి అక్రమ తవ్వకాలపై సీఐ బాలసూర్యారావు ఆధ్వర్యంలోట పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. రెండు లారీలతో పాటు ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైన్స్ అధికారులకు వాహనాలను అప్పగిస్తామని సీఐ వెల్లడించారు. అయితే వాహనాల యజమాని పేరు మాత్రం సీఐ స్పష్టంగా చెప్పలేకపోయారు. మైన్స్ అధికారులు వాహనాల యజమానుల నుంచి అపరాధ రుసుము వసూలు చేసి అనంతరం విడిచిపెడతారని సీఐ వెల్లడించారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో జగన్ దిట్ట

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్



అనకాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అన్ని వ్యవస్థలను మొదటి నుంచి మేనేజ్ చేస్తున్న వైఎస్ జగన్ అక్రమ ఆస్తుల కేసుల్లో శిక్ష తప్పదని భావించి న్యాయ వ్యవస్థలను కూడా మేనేజ్ చేయాలని కుట్రలు పన్నుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సీఎంకు బినామీలైన టీటీడీ ఈవో ధర్మారావు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను వినియోగించుకొని న్యాయమూర్తులను ప్రలోభాలకు గురి చేయాలని ప్రయత్నించారని ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశీ, నోబెల్ టీచర్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, సారా రవాణాపై నిఘా పెట్టాలి

- ఎస్ఈబీ అధికారులకు ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం

అనకాపల్లి రూరల్, జనవరి 25: గంజాయి, సారా రవాణాను నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈబీ అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జిల్లాకు కొత్తగా బదిలీలపై వచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటుసారా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి పూర్తి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయదారులపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సెబ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్‌తో పాటు సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన ఆయుధమని ఎస్పీ కేవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సిబ్బందితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ పోలీస్ సిబ్బందితో పాటు తమ కుటుంబసభ్యులు, స్నేహితులు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లోని పోలీస్ అధికారులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

ఓటు వేయడం అందరి బాధ్యత

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- వయో వృద్ధ, దివ్యాంగ ఓటర్లకు సన్మానం


వృద్ధ ఓటర్లను సత్కరించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ తదితరులు

అనకాపల్లి టౌన్, జనవరి 25: ఓటు హక్కు పొందడం, అలాగే వినియోగించడం అందరి బాధ్యత అని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియం నుంచి రోటరీ క్లబ్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలే మూల స్తంభాలని చెప్పారు. ఓటును సద్వినియోగం చేస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఓటర్లందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వీసీ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశ చరిత్రలో అనకాపల్లికి ప్రత్యేకమైన స్థానం ఉందని, 1989 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి పోటీ చేసిన ఎంపీ అభ్యర్థి కేవలం ఏడు ఓట్ల మెజారిటీతో గెలుపొంది చరిత్ర సృష్టించారని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రసంగాన్ని ఎల్ఈడీ తెరపై ప్రదర్శించారు. 80 సంవత్సరాలు దాటిన ఆడారి బంగారమ్మ, కొణతాల అప్పల నరసమ్మ అనే వృద్ధ ఓటర్లను, పి.వీరు యాదవ్, ఎం. చంద్రశేఖర్, వై.రవి అనే దివ్యాంగ ఓటర్లను సన్మానించారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణరాజ్, డీఆర్వో బి.దయానిధి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ పోలీస్ ఇతర శాఖల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమలుకాని ఎమ్మెల్యే ధర్మశ్రీ హామీ

- రోడ్డు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి నోచుకోని పిత్రిగెడ్డ
- గర్భిణులు, బాలింతలను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి డోలీమోతలే శరణ్యం
- వినూత్న రీతిలో నిరసన తెలిపిన గిరిజనులు


చెవుల్లో పూలు పెట్టుకుని డోలీలతో నిరసన తెలుపుతున్న పిత్రిగెడ్డ గిరిజనులు

రోలుగుంట, జనవరి 25 : తమ గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ మండలంలోని అర్లి పంచాయతీ పిత్రిగెడ్డ గిరిజనులు గురువారం చెవుల్లో పూలు పెట్టుకుని, డోలీ మోతలతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీటీజీ సంఘం నాయకుడు కిల్లో నరసయ్య, గ్రామ పెద్ద కొర్రా సత్తిబాబు మాట్లాడుతూ, తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి, పాఠశాల ఏర్పాటు చేయిస్తానని చోడవరం ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, సుమారు ఐదేళ్లు అయినప్పటికీ ఆయన ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదని వాపోయారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలతోపాటు తీవ్ర అనారోగ్యానికి గురైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి, మళ్లీ తిరిగి గ్రామానికి తీసుకురావడానికి ఐదు కిలోమీటర్ల మేర డోలీల్లో మోసుకెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. రోడ్డు నిర్మాణం గురించి ఎమ్మెల్యే ధర్మశ్రీ పట్టించుకోకపోవడంతో తామే ప్రతి ఇంటికి రూ.3 వేల చొప్పున చందాలు వేసుకుని కొండవాలు ప్రదేశాల్లో నడవడానికి వీలుగా మట్టి రోడ్డు వేయించుకున్నామన్నారు. తమ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేదని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు కూడా లేరని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలు కట్టడి చేయాలని ఆందోళన

- మునగపాక రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో


మునగపాకలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

మునగపాక, జనవరి 25: అనకాపల్లి- అచ్యుతాపురం రహదారిలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని మునగపాక రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేశ్ మాట్లాడుతూ ఎన్నిసార్లు అధికారులకు వినతిపత్రాన్ని ఇచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రోడ్డు విస్తరణ జరగక గోతులతో కూడిన ఈ రోడ్డుపై అనేక గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కనీసం మరమ్మతులు సైతం చేయలేదని, ఈ భారీ వాహనాల కారణంగా రోజురోజుకు రోడ్డు మరింత దారుణంగా దెబ్బతింటుందన్నారు. భారీ వాహనాలపై పెద్ద పెద్ద రాళ్లు తీసుకువెళుతున్నారని, ఇటీవల ఒక పెద్ద రాయి అదుపు తప్పి రోడ్డుపై పడిందని, అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. కాగా రాస్తారోకో వల్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇరువైపుల వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పారు. భారీ వాహనాలతో పాటు ప్రజలు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్నారని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. తక్షణమే అధికారులు భారీ వాహనాల విషయమై నిర్ణయం తీసుకోకుంటే మళ్లీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునగపాక పీఏసీఎస్ చైర్మన్ కె.రామ్మోహన్, తెలుగుదేశం పార్టీ నాయకులు మొల్లేటి సత్యనారాయణ, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశానికి తంగేడు రాజులు డుమ్మా

- పార్టీ జిల్లా అధ్యక్షుడి తీరుపై గుర్రుగా ఉన్న నేతలు
- సీఎం జగన్ సభకు జనం తరలింపుపై సమావేశం నిర్వహించాలని పార్టీ మండల అధ్యక్షుడికి వర్తమానం
- తమకు మాటమాత్రంగానైనా చెప్పలేదని తంగేడు రాజులు అసంతృప్తి
- సమావేశానికి గైర్హాజరు.. ఎంపీపీ, జడ్పీటీసీ మెంబర్ కూడా...


తంగేడు రాజులు లేకుండా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కోటవురట్ల, జనవరి 25: అధికార పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడి తీరుపై 'తంగేడు రాజులు' గుర్రు వున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భీమిలి నియోజవర్గంలో ఈ నెల 27న నిర్వహించే వైసీపీ ఉత్తరాంధ్ర సదస్సుకు సంబంధించి వైసీసీ కోటవురట్ల మండల అధ్యక్షుడు ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్ ఎంపీపీ సాగి సీతారామరాజు (సీతబాబు) గైర్హాజరయ్యారు. వీరితోపాటు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు కూడా డుమ్మా కొట్టారు. మరోవైపు రాజకీయ పార్టీ సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయం మేడపైన హాలులో నిర్వహించడం చర్చనీయాశమైంది.

భీమిలి నియోజకవర్గం పరిధిలోని సంగివలస వద్ద ఈ నెల 27వ తేదీన సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించే ఎన్నికల శంఖారావం సభకు కోటవుటర్ల మండలం నుంచి కార్యకర్తల తరలింపుపై సమావేశం ఏర్పాటు చేయాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావుకు వర్తమానం పంపారు. కానీ ఈ విషయాన్ని తంగేడు రాజులైన డీవీ సూర్యనారాయణరాజు, సాగి సీతబాబుకు జిల్లా అధ్యక్షుడు మాటమాత్రంగా అయినా చెప్పలేదు. వాస్తవంగా మండలంలో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం జరిగినా తంగేడు రాజులకు సమాచారం ఇవ్వడం ఆనవాయితీ. కానీ సీఎం సభకు జనం తరలింపు కోసం ఏర్పాటు చేసే సమావేశం గురించి వీరికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.

కాగా వైసీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు గురువారం మండల పరిషత్ కార్యాలయం పై అంతస్థులో వున్న హాల్‌లో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి తంగేడు రాజులతోపాటు ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, జడ్‌పీటీసీ సభ్యురాలు ఉమాదేవి కూడా హాజరుకాలేదు. ఇదిలావుండగా ఈ సమావేశానికి హాజరైన వెసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేశ్ వర్గీయులకు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు వర్గీయులకు మధ్య గొడవ జరిగినట్టు తెలిసింది. మండల, జిల్లా పరిషత్ నిధులు మంజూరు విషయంలో తమపట్ల వివక్ష చూపుతున్నారని రమేశ్ వర్గీయులు ఆరోపించగా, ఇరువర్గాల వారు వాగ్వాదానికి దిగినట్టు సమాచారం.

పసి బిడ్డను ఇస్తానని మోసం

- రూ.80 వేలు తీసుకొని పరారైన మహిళ
- విశాఖ కేజీహెచ్‌లో ఘటన
- వన్‌టౌన్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- ఏలూరుకు చెందిన నిందితురాలి అరెస్టు

విశాఖపట్నం, జనవరి 25: పిల్లలు లేని మహిళకు అప్పుడే పుట్టిన బిడ్డను ఇస్తానని ఆశపెట్టిన ఓ మహిళ రూ.80 వేలు తీసుకుని మోసం చేసి, పరారైంది. ఈ సంఘటన విశాఖ కేజీహెచ్‌లో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన వేణుకోటి కృష్ణవేణి (35)కి పదేళ్ల కిందట వివాహం జరిగింది. ఆమెకు పిల్లలు లేరు. దీంతో తీవ్రంగా మథనపడేది. ఈ క్రమంలో తన సమీప బంధువు వి.లక్ష్మితో బాధను పంచుకుంది. దీంతో ఆమె గాజువాకలో తనకు తెలిసిన వైద్యునికి చూపిస్తే ఫలితం ఉంటుందని చెప్పింది. ఇద్దరూ ఈనెల 20న చేబ్రోలు నుంచి బస్సులో గాజువాక బయలుదేరారు. బస్సు అన్నవరం వచ్చేసరికి వారికి ఓ మహిళ పరిచయమైంది. వారి సమస్యను తెలుసుకుని, తనకు తెలిసిన వారు కేజీహెచ్‌లో ఉన్నారని, పెంచుకుంటానంటే అప్పుడే పుట్టిన బిడ్డను న్యాయబద్ధంగా అందిస్తానని నమ్మబలికింది. అందుకు కొంత డబ్బు ఖర్చవుతుందని చెప్పింది. దీనికి అంగీకరించిన వారిద్దరూ ఈనెల 21వ తేదీన విశాఖలోని కేజీహెచ్ వద్దకు వచ్చారు. అక్కడ ఆ మహిళకు రూ.80 వేలను అందించారు. వారిని అక్కడే ఉండమని, బిడ్డను తీసుకువస్తానని చెప్పిన ఆ మహిళ కేజీహెచ్‌లో పిల్లల వార్డు వద్దకు వెళ్లింది. ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో ఆమె కోసం కేజీహెచ్ మొత్తం గాలించారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో మోసపోయామని గ్రహించి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి, మోసం చేసిన మహిళ ఏలూరుకు చెందిన దొంగ వాణి (31)గా గుర్తించారు. ఆమె విశాఖలోని ఎన్జీవో కాలనీలోనే నివాసముంటున్నట్టు గుర్తించి, అరెస్టు చేశారు.

ఉద్యమ నేత బాలకృష్ణకు నివాళి



బాలకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

అనకాపల్లి టౌన్, జనవరి 25 : జిల్లాలో ఏ ఉద్యమాల్లోనైనా నేనున్నానంటూ ముందు నిలిచిన వ్యక్తి బాలకృష్ణ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్‌లో కామ్రేడ్ ఎ.బాలకృష్ణ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలకు బాలకృష్ణ రూపకర్తగా నిలిచారని కొనియాడారు. జిల్లాలో సాగిన అనేక ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. వామపక్ష ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ దశాబ్దకాలంగా బాలకృష్ణ అనేక ఉద్యమాల్లో పాల్గొని అందరికీ ఆదర్శప్రాయుడయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి. వెంకటరమణ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షుడు బి. ప్రభావతి, సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, పాత్రికేయుడు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. బాలకృష్ణ జ్ఞాపకాలు పేరుతో బాలకృష్ణ స్మృతులను సంకలనంగా తీసుకువచ్చిన పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు.

27 నుంచి జేఈఈ మెయిన్స్

- వచ్చే నెల ఒకటో తేదీ వరకు పరీక్షలు
- విశాఖలో పరీక్షలకు 20 వేల మంది విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలు కల్పించేందుకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. ప్రధానంగా బీఇ/బీటెక్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు జేఈఈ పరీక్షకు హాజరవుతారు. ప్రతిరోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరగనున్న ఈ పరీక్షలకు ఉత్తరాంధ్ర నుంచి సుమారు 20 వేల మంది హాజరవుతున్నారు. ఆర్కిటెక్చర్ కోర్సుల్లో చేరనున్న విద్యార్థులకు జేఈఈ పేపర్-2 పరీక్ష బుధవారం జరిగింది. నగరంలో చినముషిడివాడ, షీలానగర్, గాజువాక, ఎన్ఏడీ జంక్షన్‌లోని డిజిటల్ సెంటర్లను జేఈఈ మెయిన్స్ పరీక్షలకు కేంద్రాలుగా ఎంపిక చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంటన్నర ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కులను కటాఫ్‌గా తీసుకుని అడ్వాన్స్‌డ్ ప్రవేశపరీక్షకు అర్హత కల్పిస్తారు. ఎన్ఐటీతోపాటు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన మార్కులను ప్రాతిపదికగా తీసుకుంటారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇప్పటికే అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకున్నారు.

ఏడుగురు సీఐలు బదిలీ

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో ఏడుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూ రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు వాసంశెట్టి శ్రీనివాసరావు, టి.కల్యాణి, రొంగలి అప్పలనాయుడు, శ్రీకాకుళం జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎక్స్) సీఐగా ఉన్న జి.దాలిబాబును విశాఖ నగరానికి కేటాయించారు. విశాఖ రేంజ్‌లో ఉన్న జి.దివాకర్ యాదవ్‌ను శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస సీఐగా పోస్టింగ్ ఇచ్చి అక్కడ పనిచేస్తున్న పి.పైడయ్యను టెక్కలి సీఐగా, అనకాపల్లి పోలీస్ కంట్రోల్‌రూమ్‌లో పనిచేస్తున్న సీఐ పి.పైడపునాయుడును అనకాపల్లి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

29 నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, జనవరి 25: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ప్రజాభిప్రాయ సేకరణను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నిర్వహించనుంది. విద్యుత్ సంస్థలు ఏపీఈఆర్‌సీకి సమర్పించిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి అమలుచేయనున్న వార్షికాదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), బహుళ వార్షిక కాల వ్యవధి 2024 నుంచి 2029 నియంత్రణ కాలానికి సంబంధించి నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలపై ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం 10-30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి, 2 నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు వర్చువల్‌గా అభిప్రాయాలు తెలపవచ్చని సంస్థ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రాంసింగ్, పీవీఆర్ రెడ్డి హాజరవుతారన్నారు. ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఇంధనశాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొంటారన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీఈఆర్సీ ప్రతి రోజు ట్రాన్స్‌కో, జెన్‌కో, మూడు విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన అభిప్రాయాలను విశాఖ నుంచే స్వీకరిస్తారన్నారు. అభిప్రాయాలు చెప్పదలచుకున్నవారు గ్రీన్‌పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న విద్యుత్ శాఖ భవన్‌లోని విశాఖపట్నం ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఎస్ఈ ఆఫీస్, జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆఫీస్, జోన్-2 కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆఫీస్, మధురవాడ, అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం ప్రాంతాల్లోని ఈఈ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

సింహాద్రి ఎన్టీపీసీ నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, జనవరి 25: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లోని నాలుగో యూనిట్‌లో గురువారం మధ్యాహ్నం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్థాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభించారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ఎన్టీపీసీలోని నాలుగు యూనిట్లు ఒక్కొక్కటి 500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉన్నాయి.

నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో టెస్టు మ్యాచ్ టికెట్లు విక్రయం


విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 25: భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో తేదీ నుంచి నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న టెస్టు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు శుక్రవారం నుంచి ఆఫ్‌లైన్‌లో విక్రయిస్తామని ఏసీఏ కార్యదర్శి గోపినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద శుక్రవారం నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు, పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వద్ద శుక్రవారం నుంచి ఆరో తేదీ వరకు ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు టికెట్ల విక్రయాలు జరుగుతాయన్నారు. రోజుకు రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నామని, ఆసక్తి గల వారు పాఠశాల గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

టికెట్ల ధరలివి

రోజువారీ టికెట్ల ధరలు: రూ.100, రూ.200, రూ.300, రూ.500.

ఐదు రోజులకు సీజన్ టికెట్లు: రూ.400, రూ.800, రూ.1,000, రూ.1500

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు



అనకాపల్లి టౌన్, జనవరి 25 : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం జరిగే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యే ఉన్నతాధికారులు, వీఐపీలు కూర్చోవడానికి అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. వివిధ స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. శకటాలను సిద్ధం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

కన్నుల పండువగా దుర్గాలమ్మ తీర్థం

రాంబిల్లి, జనవరి 25 : మండలంలోని కొండవారపాలెంలో గురువారం దుర్గాలమ్మ తీర్థం కన్నుల పండువగా జరిగింది. అమ్మవారిని గ్రామస్థులే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా దర్శించుకున్నారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

అనకాపల్లి టౌన్, జనవరి 25 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూయాజమాన్య చట్టాన్ని నిరసిస్తూ కోర్టు వద్ద న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారానికి 34వ రోజుకు చేరుకున్నాయి. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షల్లో న్యాయవాదులు అప్పలనాయుడు, అప్పారావు కూర్చున్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయి లక్ష్మణ్, శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు ఎం.కుమార్, జగదీష్, హరశ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అనకాపల్లి టౌన్, జనవరి 25 : స్థానిక మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో గురువారం కొణతాల లక్ష్మీనారాయణ, సూర్యకళ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు డాక్టర్ కొణతాల నగేశ్, కొణతాల జగదీష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో అత్యాధునిక పరికరాలతో క్యాన్సర్ పరీక్షలతోపాటు పలు రకాల పరీక్షలను రోగులకు ఉచితంగా నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్టు గౌరమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు తెలిపారు. డాక్టర్ బ్రహ్మానాయుడు, వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించారని చెప్పారు.

జాతీయ షూటింగ్‌బాల్ జట్టు

సబ్బవరం, జనవరి 25 : మహారాష్ట్ర లాతూరులో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకూ జరగనున్న 42వ షూటింగ్‌బాల్ పోటీలకు ఏపీ జట్టు ఎంపికైందని షూటింగ్‌బాల్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి పైల ప్రవీణ్ తెలిపారు. పోటీలకు సీనియర్ క్రీడకారులు ఎస్. శ్రావణి, ఎ. గాయత్రి, ఎస్. శ్వేత, టి. కౌశిక్, కె. భాస్కర్‌నాయుడు, కె. మహేంద్ర ఎంపికయ్యారని ప్రవీణ్ తెలిపారు.

వెంకటనగర్ కాలనీలో భవిష్యత్తుకు గ్యారెంటీ

నక్కపల్లి, జనవరి 25: మండల కేంద్రంలోని వెంకట్‌నగర్ కాలనీలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ టీడీపీ సూపర్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అద్దూరి లోవరాజు, పెదిరెడ్డి రమేశ్, మీసాల బాబులు, అల్లాడ తాతారావు, సకురు సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం


పాయకరావుపేటలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న దృశ్యం



కశింకోటలో ఓటర్స్ డే ఆకారంలో ఉన్న విద్యార్థులు


ఎలమంచిలిలో సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, జనవరి 25 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దారు కె.జయప్రకాష్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని పలువురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ, స్థానిక తాండవ జంక్షన్ వద్ద మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ కె.నూకరాజు, ఆర్ఐలు, పలువురు వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలిలో పలు పాఠశాలల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈఆర్వో మనోరమ యువతకు ఓటర్ల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రాణి అమ్మాజీ, విశ్రాంత అధ్యాపకుడు ఏపీ.జగన్నాథం పాల్గొన్నారు. అదేవిధంగా ఏటికొప్పాక, పేట బయ్యవరం గ్రామాల్లోని పాఠశాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

అనకాపల్లి టౌన్‌లో.. స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్ గురువారం ఓటరు దినోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్ నుంచి రింగురోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, శారదాబ్రిడ్జి, చోడవరం రోడ్డు మీదుగా ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో మొల్లి చంద్రశేఖర్, అప్పలకొండ, దిలీప్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో.. ఓటు హక్కుని అంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమార్, విఆర్వో శశిధర్ పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని దిమిలి పీహెచ్‌సీ వైద్యులు బాలశ్రావణి ఆధ్వర్యంలో నేషనల్ ఓటర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ ధనరాజు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి అవగాహన ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు, డీటీ వెంకట్, ఏపీఎం సాయిరమేష్, ఏపీవో శ్రీనివాసరావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

కోటవురట్లలో.. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఎంఈవో రామారావు, జోషి, ఎస్ఐ రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తహసీల్దార్ విజయకుమార్ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సచివాలయం సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పేటసూదిపురంలో నిర్వహించిన అవగాహన సదస్సులో సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్ వాసంతి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నక్కపల్లిలో.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో హైస్కూల్ మైదానంలో మానవహారం చేసి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ఓటర్లను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఏవో డి.సీతారామరాజు,ఎంఈవో కె.నరేశ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గంటా తిరుపతిరావు, అల్లాడ కొండ పాల్గొన్నారు. అదేవిధంగా పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్ఎం సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, చిన్నారావు, రమేశ్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చినదొడ్డిగల్లు హైస్కూల్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లీష్ క్లబ్ వ్యవస్థాపకులు యేడిద వెంకట రమణ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

కశింకోటలో.. స్థానిక డీపీఎస్ జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ అప్పారావు ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ఆంగ్ల అక్షరాలతో ఓటర్స్ డేగా చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ వి. ప్రభాకర్, బి. అప్పారావు, ఆచంట నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సబ్బవరంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ


కోటవురట్లలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

బీసీలపై దాడులు ఆపకుంటే వెంటబడి తరుముతాం : బుద్ద

మునగపాక, జనవరి 25 : జగన్‌రెడ్డి పాలనలో బీసీలపై లెక్కలేనన్ని దాడులు జరిగాయని, దాడులను తక్షణం ఆపకుంటే ఈ ఎన్నికల్లో బీసీలు వెంటబడి తరుముతారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం మునగపాకలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఎలమంచిలి నియోజకవర్గ జయహో బీసీ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. తాను అధికారంలోకి వస్తే బీసీ పాలన తెస్తానని జగన్ చెప్పి ఇపుడు రెడ్ల పాలన తెచ్చారన్నారు. ప్రతి ప్రాంతానికి రెడ్లను సామంతరాజులుగా నియమించుకుని, అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నారు. బీసీల ఆగ్రహానికి ముఖ్యమంత్రి గురి కాక తప్పదన్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అన్న జగన్ మాటలకు బీసీలు పడిపోయి అధికారం కట్టబెట్టారన్నారు., టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ 40 ఏళ్లలో బీసీలకు ఎటువంటి ప్రాధాన్యత టీడీపీ ఇచ్చిందో వారికి తెలుసునని అన్నారు. గత ఎన్నికలలో మాత్రమే జగన్ మాయలో బీసీలు పడ్డారని, ఈ నాలుగేళ్లలో జగన్ వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, బీసీ నాయకులు గిరిజల లక్ష్మణరావు, పెంటకోట విజయ్, సబ్బి శ్రీనివాసరావు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి మంజు, బత్తుల లక్ష్మి, గుడాల సత్యనారాయణ పాల్గొన్నారు.


వేదికపై సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా


ఎలమంచిలిలో ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేస్తున్న విశ్రాంతి ఉద్యోగులు


అనకాపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు


పరవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

అనకాపల్లి టౌన్, జనవరి 25 : తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అనకాపల్లి తాలూకా యూనిట్ పెన్షనర్ల సంఘం సభ్యులు ధర్నా నిర్వహించారు. 11వ పీఆర్సీలో జనవరి- 2022 నుంచి తగ్గించిన అడిషినల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి.జగన్నాథ రాజు, బీఎల్ఎన్ శర్మ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 11వ పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ పరిధి రూ. రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచాలని కోరారు. అనంతరం తహసీల్దార్ గంగాధరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఎస్.బాబురావు, ఎం.వరలక్ష్మి, శేషగిరిరావు, గోపీ, ఆడారి సన్యాసిరావు, శ్రీపాద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో.. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ పరవాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదిరెడ్డి సన్నిబాబు, జీవీపీ దీక్షితులు, సంఘం వ్యవస్థాపకుడు బొండా అప్పారావు, గౌరవాధ్యక్షుడు పైలా సన్యాసిరావు, విశ్రాంత ఉద్యోగులు బాలరాజు, గొర్లి సన్యాసినాయుడు, పైలా సత్యనారాయణ, నరసింహమూర్తి, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పట్టణంలో ప్రధాన రోడ్డుపై గురువారం నిరసన తెలిపారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్, సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్స్‌కు రావాల్సిన ఏరియర్స్, డీఏలు, పీఆర్సీ ఏరియర్స్‌ను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి. సాంబమూర్తి, సంఘ ప్రతినిధులు, సభ్యులు ఆడారి పూరి జగన్నాథం, సన్యాసిరావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు పెన్షనర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు జయప్రకాష్‌ని కలిసిన పెన్షనర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వీ.రమణమూర్తి, వి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ఖాళీ మద్యం సీసాలు

ఎలమంచిలి, జనవరి 25 : మండలంలోని రేగుపాలెం హైస్కూల్ పరిసరాల్లో ఖాళీ మద్యం సీసాలు వేస్తుండడంతో తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని అదే గ్రామానికి చెందిన పి. జానకి పేర్కొన్నారు. తాను ఇదే స్కూలులో శానిటరీ వర్కర్‌గా పనిచేస్తున్నానని, స్కూలును పరిశుభ్రం చేస్తుండగా మద్యం సీసాలు పెంకులు గుచ్చుకుంటున్నాయన్నారు. స్కూలు పరిసరాల్లో ఖాళీ మద్యం సీసాలు వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

సొంతగూడు ఒనగూరదా!?

... 5వ పేజీ తరువాయి

144 ప్లాట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయిన 1,296 ప్లాట్లకు సంబంధించి 918 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేశారు. 368 మంది లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ సమస్య, 60 ఏళ్లు పైబడిన వారు, ఫ్లాట్లు తీసుకోవడానికి ముందుకు రానివారు ఉన్నారు. వీరికి బదులు కుటుంబ సభ్యులకు బ్యాంకు రుణాలు మంజూరుచేయించి ఫ్లాట్లు అప్పగించాలని ప్రభుత్వం హౌసింగ్ అధికారులను ఆదేశించింది.

మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర జాప్యం

టిడ్కో గృహసముదాయంలో 90 శాతానికిపైగా ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేసినప్పటికీ.. వాటర్ ట్యాంకు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులు అసంపూర్తిగా వున్నాయి. కొత్త బయపురెడ్డిపాలెం- కసిమి రోడ్డులోని టిడ్కో కాలనీకిఇ ప్రధాన రహదారిని కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు, వాటర్ ట్యాంక్‌లు నిర్మించాలి. బలిఘట్టంలో డ్రైనేజీ కాలువలు, రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు బిగించి, ఫ్లాట్లకు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు.

టిడ్కో గృహాల పంపిణీపై సందిగ్ధం

ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ గత ఏడాది డిసెంబరు 21వ తేదీన నర్సీపట్నం వచ్చి టిడ్కో గృహసముదాయాల్లో పనులను పరిశీలించారు. జనవరి 25వ తేదీలోగా గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామని ఆయన చెప్పారు. తరువాత మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి.. జనవరి 20వ తేదీన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ టిడ్కో చైర్మన్, మునిసిపల్ చైర్‌పర్సన్ చెప్పిన గడువు తీరిపోయింది. లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయలేదు. వాటర్ ట్యాంకు, సెప్టిక్ ట్యాంకు, మురుగునీటి శుద్ధి యూనిట్ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభ దశలోనే వున్నాయి. రోడ్లు, విద్యుత్ పనులు కూడా పూర్తికాలేదు. ఈ పనులన్నీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు వున్నాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఇళ్ల పంపిణీ సాధ్యం కాదు.

సంస్థాగతంగా బలమైనది టీడీపీ : పీలా గోవింద

కశింకోట, జనవరి 25: దేశంలోనే సంస్థాగతంగా బలమైనది తెలుగుదేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ యువ నాయకుడు దాడి రత్నాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో టీడీపీ మండల స్థాయి కార్యకర్తలు, నాయకులు, బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్టీ రామారావు స్థాపించిన పార్టీలో మనమంతా భాగస్వాములు కావడం అదృష్టంగా భావించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలన అంతమొందించాలంటే మరో 80 రోజులు అందరూ కష్టపడితే మంచి పాలన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, శ్రీనివాసరావు, బాబా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

రాంబిల్లి, జనవరి 25 : మండలంలోని డ్వాక్రా మహిళలకు ఆసరా నాలుగో విడత చెక్కును ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాలలో ఆర్థిక ప్రగతిని సాధించాలన్నారు. గత నాలుగు విడతలుగా మండలంలో 1156 గ్రామైఖ్య సంఘాలలో 12.044 మంది సభ్యులకు రూ.32.38 కోట్లు ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, జడ్‌పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, ఎంపీపీ జి.శిరీష, వైస్‌ఎంపీపీలు కొరెడ్డి నరసింగరావు, కోటాపు లక్ష్మి, తహసీల్దార్ పి.భాగ్యవతి, ఎంపీడీఓ కేవీఎస్ కొండలరావు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిషోర్, వెలుగు ఏపీఎం పద్మ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం. నాగసత్య పాల్గొన్నారు.

నేడు అచ్యుతాపురంలో శ్రీనివాస కల్యాణం


శ్రీనివాసుని కల్యాణానికి ఏర్పాటు చేస్తున్న మండపం

అచ్యుతాపురం, జనవరి 25: స్థానిక మండల కాంప్లెక్స్‌లో శ్రీనివాసా పద్మావతి కల్యాణాన్ని శుక్రవారం జరపడానికి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వికాస తరంగిని ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కల్యాణానికి 400 జంటలు పాల్గొంటున్నట్టు వికాస తరంగిణి సమన్వయకర్త సరిసా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం సుందరకాండ పారాయణం జరిగింది. శుక్రవారం శ్రీరామ రక్ష స్తోత్రం, లక్ష్మీ సహిత విష్ణు సహస్రనామ స్తోత్రం అనంతరం పద్మావతి సహిత శ్రీనివాసుని కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

మహిళా సాధికారతే లక్ష్యం : అదీప్‌రాజ్

పరవాడ, జనవరి 25 : మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గురువారం ఇక్కడ డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం నాల్గో విడత చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీడీవో హేమసుందరరావు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దాడిని కలిసిన టీడీపీ నేతలు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద వీరభద్రరావుతో టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 25: స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం జీవీఎంసీ విలీన గ్రామాలైన కొప్పాక, కేఎస్ఆర్‌పేట, సిరసపల్లి, వల్లూరు, రాజుపాలెం, గొర్లివానిపాలెం, ఎరుకువానిపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, టీడీపీ యువ నాయకుడు దాడి రత్నాకర్‌లను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా రత్నాకర్‌ను గజమాలతో సత్కరించి అభినందించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. టీడీపీ నాయకులు కొరెడ్డి సత్యనారాయణ, సిరసపల్లి సన్యాసిరావు, వానపల్లి బాబూరావు, యర్రా సత్యనారాయణ, గొల్లవిల్లి కోటేశ్వరరావు, టి. సూరిఅప్పారావు, కె. గోవిందరావు కలిసిన వారిలో ఉన్నారు.

టెన్నికాయిట్ శిక్షణ శిబిరం ప్రారంభం

అనకాపల్లి టౌన్, జనవరి 25 : స్థానిక జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో రాష్ట్ర టెన్నికాయిట్ బాలబాలికల జట్ల శిక్షణ శిబిరాన్ని గురువారం కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య ప్రారంభించారు. ఫిబ్రవరి ఆరు నుంచి పదో తేదీ వరకు రాజస్థాన్‌లోని జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సూర్యనారాయణ, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.రమణారావు, కోచ్‌లు రాజు, ఎల్.త్రిమూర్తులు, ఎన్‌సీసీ అధికారి కె.జనార్దన్, పీఈటీ పూర్ణిమ పాల్గొన్నారు.

తులసీ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, రమాకుమారి

ఎలమంచిలి, జనవరి 25 : విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు జన్మదినం సందర్భంగా ఎలమంచిలిలో నిర్వహించే తులసీ తీర్థాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ కుటుంబ సభ్యులు, డెయిరీ డైరెక్టర్లు సమక్షంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అదే రోజున తులసీరావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆనంద్ కుటుంబ సభ్యులు, చైర్‌పర్సన్ రమాకుమారి, డెయిరీ డైరెక్టర్లు రామకృష్ణ, ఆనంద్ అనుచరులు, నేతలు ఆడారి వెంకట్ పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ నమూనా పేపర్ విడుదల

ఎస్.రాయవరం, జనవరి 25: మండలంలోని కొరుప్రోలు జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ నమూనా పేపర్‌ను హెచ్ఎం విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో మోడల్ నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ ఎం రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో ఎన్ఎస్ఎస్ బృందం పర్యటన

అనకాపల్లి రూరల్, జనవరి 25 : మండలంలోని అక్కిరెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్‌లో గురువారం డైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ టీమ్ స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూపట్టాలు పంపిణీ

రాంబిల్లి, జనవరి 25 : మండలంలోని లాలంకోడూరు శివారు రామచంద్రపురంలో సాగులో ఉన్న భూములకు గురువారం ఎమ్మెల్యే యూవీ.రమణమూర్తిరాజు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ గడప, గడపకు కార్యక్రమంలో వచ్చిన వినతి మేరకు 17 మంది పేద రైతులకు 17.65 ఎకరాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, జడ్‌పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, తహసీల్దార్ పి.భాగ్యవతి, వైసీపీ మండల కన్వీనర్ పి.కిషోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు, వైసీపీ యువనేత డీఎస్ఎన్‌రాజు, సర్పంచ్ లాలం రమణమూర్తి, ఉప సర్పంచ్ రుత్తల గుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

రాంబిల్లి, జనవరి 25 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని కొత్తూరు సర్పంచ్ నానేపల్లి సాయి, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు అన్నారు. గురువారం కొత్తూరు జడ్‌పీహెచ్ఎస్ స్కూల్లో బైజూస్ ట్యాబ్‌లను వారు అందజేశారు.కార్యక్రమంలో హెచ్ఎం రాధామాధవి, ఉపాధ్యాయుడు కామరాజు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు మునగపాక టీమ్

మునగపాక, జనవరి 25 : ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు మునగపాక జట్టు ఎంపికైంది. మునగపాక టీం నియోజకవర్గ స్థాయి పోటీలలో రాంబిల్లి, అచ్యుతాపురం జట్లుతో ఆడి విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయికి పోటీలకు ఎంపిక కావడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

స్కాలర్‌షిప్‌కు డీపీఎన్ విద్యార్థి ఎంపిక

కశింకోట, జనవరి 25 : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి సీహెచ్. శ్యామ్‌విజయ్ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్టు హెచ్ఎం అప్పారావు తెలిపారు. ఇతనికి ప్రతిఏటా రూ.12,500లు చొప్పున నాలుగేళ్లు అందుతుందన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

రూరల్ ఎస్ఐగా భీమరాజు బాధ్యతలు



నర్సీపట్నం అర్బన్, జనవరి 25 : నర్సీపట్నం రూరల్ ఎస్ఐగా సీహెచ్.భీమరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఇదిలావుంటే, ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న ధనుంజయనాయుడును రావికమతం బదిలీపై వెళ్లారు.

జాబ్ మేళాలో 17మంది ఉద్యోగాలకు ఎంపిక

నర్సీపట్నం, జనవరి 25 : ఇక్కడి బీఆర్ ఫిషరీస్ కళాశాలలో గురువారం అవంతి ఫీడ్స్ కంపెనీ జాబ్ మేళా నిర్వహించింది. మొత్తం 30 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 17మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ టెక్నికల్ మేనేజర్ రంగబాబు, మార్కెటింగ్ మేనేజర్ సాంబశివరావు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన వారిని కళాశాల కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రమేష్ అభినందించారు.

కోడిపందాలు ఆడుతున్న ఐదుగురిపై కేసు

కృష్ణాదేవిపేట, జనవరి 25: కోడిపందాలు ఆడుతున్న ఐదుగుర్ని పట్టుకున్నట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి నాగాపురం ఎస్సీకాలనీలో కోడిపందాలు ఆడుతున్నవారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ. మూడొందల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

'అసరా పథకం పేరిట మహిళలకు మోసం'

నర్సీపట్నం అర్బన్, జనవరి 25 : ఆసరా పేరుతో సీఎం జగన్‌రెడ్డి మహిళలను మోసం చేశారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. గురువారం ఆయన ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 14లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే కేవలం ఈ పథకం 79 లక్షల మందికే అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దేపల్లి గణేష్, సేనాపతి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. నీతిమంతులకు చోటు

ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆర్డీవో జయరాం



నర్సీపట్నంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జనవరి 25 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కలిగి ఉండడం ప్రాథమిక హక్కు అని ఆర్డీవో జయరాం అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ కాంపెక్స్ కూడలి నుంచి శారదానగర్, వెంకునాయుడుపేట మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి గురువారం భారీ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని తద్వారా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు, తహసీల్దార్ అన్నాజీరావు, ఎలక్షన్ డీటీ సుధావాణి, ఎంఈవో తలుపులు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొండలఅగ్రహారంలో ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అలాగే తూటిపాల, మాకవరపాలెం హైస్కూళ్లలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో డీటీ శంకరరావు, ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయులు కోసూరు రాము, ఆర్ఐ శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : మండల కేంద్రం నాతవరంతో పాటు వివిధ పంచాయతీలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ, విద్యాశాఖల ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఎంపీడీవో తో పాటు డీటీ చైనులు, ఎంఈవో అమృతకుమార్, ఏవో పి.పార్థసారధి, సర్పంచ్ గొలగాని రాణి, ఉపసర్పంచ్ కరక అప్పలరాజు, వీఆర్ఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నాతవరం సచివాలయం వద్ద సీనియర్ ఓటర్లను సత్కారించారు.

అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ పింఛనర్ల ఆందోళన

నర్సీపట్నం, జనవరి 25 : అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పింఛనర్లు ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ పింఛనర్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ మాట్లాడుతూ 11వ పీఆర్‌సీలో 2022 జనవరి ఒకటి నుంచి అడిషనల్ క్వాంటమ్ తిరిగి యథావిధిగా పునరుద్ధరించాలని, పెండింగ్‌లోని డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి వీఎస్ఎన్ రాజు, సీనియర్ సిటిజెన్స్ సంఘం కార్యదర్శి కేవీ సుబ్బారావు, ఎం.శ్రీరామరాజు, వి.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : సమస్యలు పరిష్కరించాలంటూ పెన్షనర్లు ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షులు కోసూరు రామారావు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి, తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శేషగిరిరావు, రంగరాజు, అచ్యుతరావు, నూకరాజు, ఆర్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ, జనసేన కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ

నాతవరం, జనవరి 25 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మాజీ జడ్పీటీసీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ పిలుపునిచ్చారు. నాతవరంలో గురువారం ఇరు పార్టీల శ్రేణులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. తాండవ లికేజీలను అరికట్టకపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నా వైసీపీ నాయకులు పట్టించుకోలేదన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి కొండ్రు మరిడియ్య మాట్లాడుతూ వాట్సాప్ గ్రూపులలో వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జనసేన మండల నాయకుడు బైన మురళి మాట్లాడుతూ టీడీపీ, జనసేన కలిసి పనిచేస్తే పోటీలో నిలిచే అభ్యర్థికి మండలంలో 15వేల ఓట్ల మెజార్టీ తథ్యమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎన్.విజయ్‌కుమార్,సింగంపల్లి సన్యాసిదేముడు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, జనసేన మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, మండల తెలుగుయువత అధ్యక్షుడు శెట్టి లోవ , టీడీపీ సీనియర్ నాయకులు జీరెడ్డి రాజుబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారామ్మూర్తి, పారుపల్లి వెంకటరమణ, శెట్టి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సొంతగూడు ఒనగూరదా!?



కొనసాగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు

... 5వ పేజీ తరువాయి

144 ఫ్లాట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయిన 1,296 ఫ్లాట్లలకు సంబంధించి 918 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు చేశారు. 368 మంది లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ సమస్య, 60 ఏళ్ల పైబడిన వారు, ఫ్లాట్లు తీసుకోవడానికి ముందుకు రానివారు ఉన్నారు. వీరికి బదులు కుటుంబ సభ్యులకు బ్యాంకు రుణాలు మంజూరుచేయించి ఫ్లాట్లు అప్పగించాలని ప్రభుత్వం హౌసింగ్ అధికారులను ఆదేశించింది.

మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర జాప్యం

టిడ్కో గృహసముదాయంలో 90 శాతానికిపైగా ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేసినప్పటికీ.. వాటర్ ట్యాంకు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులు అసంపూర్తిగా వున్నాయి. కొత్తబయపురెడ్డిపాలెం- కసిమిరోడ్డులోని టిడ్కో కాలనీకిఇ ప్రధాన రహదారిని కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు, వాటర్ ట్యాంకలు నిర్మించాలి. బలిఘట్టంలో డ్రైనేజీ కాలువలు, రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడా విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు బిగించి, ఫ్లాట్లకు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మురుగునీటి శుద్ధిప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు.


టిడ్కో గృహాల పంపిణీపై సందిగ్ధం

ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ గత ఏడాది డిసెంబరు 21వ తేదీన నర్సీపట్నం వచ్చి టిడ్కో గృహసముదాయాల్లో పనులను పరిశీలించారు. జనవరి 25వ తేదీలోగా గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామని ఆయన చెప్పారు. తరువాత మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి.. జనవరి 20వ తేదీన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని మీడియా సమావేశంలో చెప్పారు. కానీ టిడ్కో చైర్మన్, మునిసిపల్ చైర్‌పర్సన్ చెప్పిన గడువు తీరిపోయింది. లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయలేదు. వాటర్ ట్యాంకు, సెప్టిక్ ట్యాంకు, మురుగునీటి శుద్ధి యూనిట్ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభ దశలోనే వున్నాయి. రోడ్లు, విద్యుత్ పనులు కూడా పూర్తికాలేదు. ఈ పనులన్నీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు వున్నాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఇళ్ల పంపిణీ సాధ్యం కాదు.

చోడవరం
నియోజకవర్గం







ఘనంగా ఓటరు దినోత్సవం



చోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చోడవరం, జనవరి 25: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని స్థానిక డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని ఉషోదయ కళాశాల విద్యార్థులతో ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటగిరి, వీఆర్వోలు, ఉషోదయ కళాశాల డీన్ ఎస్‌వీ. వాసు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగులలో.. రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలని తహసీల్దార్ పీవీ రత్నం కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక హైస్కూల్ కాలనీ నుంచి బస్టాండ్ వరకు రాలీ నిర్వహించిన అనంతరం మాడుగుల బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణచంద్రరావు, వీరనారాయణం హెచ్‌ఎం జగన్నాథరావు పాల్గొన్నారు.

రావికమతంలో.. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఓటుహక్కును వినియోగించుకుంటామంటూ తహసీల్దార్ మహేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు.

రోలుగుంటలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధ ఓటర్లను తహసీల్దార్ వరహాలు సన్మానించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటుహక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి పాల్గొన్నారు.

దేవరాపల్లిలో.. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుంమంటూ స్థానిక సబ్‌స్టేషన్ సిబ్బంది గురువారం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ కర్రిశంకరరావు, సబ్ ఇంజనీర్ సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు. నిజాయితీగా ఓటు హక్కు వినయోగిస్తామని అధికారులు ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరుణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ చంద్రరావు, సర్వేయర్ సింహాచలం, సిబ్బంది మణి పాల్గొన్నారు.

కె.కోటపాడులో.. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను మాడుగుల నియోజకవర్గ అధికారి టి.రాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేషబాబు, ఎంపీడీఓ ప్రసాదు, ఎంఈఓ ప్రసాదు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంటలో వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ వరహాలు



బుచ్చెయ్యపేటలో సీనియర్ సిటిజన్లను సన్మానించిన తహసీల్దార్ అరుణ్‌కుమార్



మాడుగులలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

మాడుగుల
నియోజకవర్గం

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్ ఎం.లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

దేవరాపల్లి, జనవరి 25: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఐదు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏపీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఆదిరెడ్డి చినకన్నబాబు గురువారం తహసీల్దార్ ఎం.లక్ష్మికు అందజేశారు. 11వ పీఆర్సీలో 2022 నుంచి తగ్గిన అడిషినల్ క్వాంటంను పునరుద్ధరించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, 11వ పిఆర్సీ బకాయిలు చెల్లించాలని, తదితర సమస్యలను కోరారు. ఎ.చిన్నంనాయుడు, రొంగలి సత్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రగ్గుల పంపిణీ

దేవరాపల్లి, జనవరి 25: స్థానిక భవిత కేంద్రంలో ఎస్.అప్పారావు దంపతులు దివ్యాంగ విద్యార్థులకు సమకూర్చిన రగ్గులను ఎంఈఓ బి. పడాల్ దాస్, ఉషారాణి గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సేవ చేసే హృదయం అందరికీ కలగాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్‌ను విద్యార్థులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనిఇవాసరావు, లక్ష్మణరావు, ఏకేఎస్.నాయుడు, శ్రీదేవిఇ, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ధనుంజయనాయుడు బాధ్యతల స్వీకారం

రావికమతం, జనవరి 25: స్థానిక ఎస్ఐగా జి.ధనుంజయనాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఉమామహేశ్వరావును ర్సీపట్నం రూరల్‌కు బదిలీ అయ్యారు. కాగా.. అక్కడ పనిచేస్తున్న ధనుంజయనాయుడును ఇక్కడికు బదిలీ చేయడంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన సీఐ

రావికమతం, జనవరి 25: కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను గురువారం పరిశీలించారు. రావికమతం తట్టబంద, తోటకూరపాలెం, గుడ్డిప, మరుపాక, చినపాచిల, గుమ్మాళ్ళపాడు, కొమిర, కవ్వగుంట, కేబీపీ అగ్రహారం తదితర గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను ఆయన బీఎల్ఓలతో కలసి పరిశీలించారు. బూత్‌లలో విద్యుత్, వెంటిలేటర్, తదితర సౌకర్యాలతో పాటు ప్రహరీ ఉందా.. దివ్యాంగులు ఓటు వేసేందుకు సౌకర్యాలు ఉన్నదీ లేనిదీ పరిశీలించారు.

'వైద్యులపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు అమలు చేయాలి'

చోడవరం, జనవరి 25: రాష్ట్రంలో వైద్యులపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు అమలు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చోడవరం యూనిట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. వైద్యులపై దాడుల నేపథ్యంలో గురువారం ఐఎంఏ వైద్యులు ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, తన వద్దకు వచ్చే ప్రతి రోగిని కాపాడడానికే డాక్టర్ ఉంటారని, కొన్ని సంఘటనల్లో డాక్టర్లు చేయడానికి కూడా ఏమీ సాధ్యం కాని పరిస్థితులు తలెత్తుతాయన్నారు. అలాంటి సమయంలో రోగి బంధువులు అపోహలతో డాక్టర్లపై దాడులకు తెగబడుతున్నారని, దీనిని ఐఎంఏ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. వీలేరులో వైద్యులపై దాడులను ఈ కోణంలోనే చూడాలన్నారు. ప్రభుత్వం కూడా డాక్టర్లపై దాడులకు సంబంధించి కఠిన చర్యలు చేపట్టడంతోపాటు రక్షణ కల్పించేలా చట్టాలు రూపొందించాలన్నారు. సమావేశంలో ఐఎంఏ చోడవరం యూనిట్ అధ్యక్షుడు రాజాన అప్పలనాయుడు, డాక్టర్ శకుంతలరావు, దినేష్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా..



చోడవరం, జనవరి 25: పట్టణంలో ఇంటింటికీ తాగునీటి పథకం కింద వేసిన కొళాయిలకు ట్యాపులు లేకపోవడంతో పలు ప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతున్నది. కొళాయిలకు వేసిన ట్యాపులను ఆకతాయిలు తొలగించడంతో కో-ఆపరేటివ్ కాలనీలోని సీడీసీ కార్యాలయం, శాఖా గ్రంథాలయం వద్ద తాగునీరు వృథాగా అవుతున్నది.

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : బూడి



చీడికాడలో వృద్ధులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

చీడికాడ, జనవరి 25: గ్రామీణాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మండల కేంద్రంలో గురువారం గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీడికాడ నుంచి కొండవీధికి, చీడికాడ నుంచి శిరిజాం గ్రామానికి వేసిన తారురోడ్లను ప్రారంభించారు. అనంతరం చీడికాడ గోపీనగర్ కాలనీలో నీటి పథకానికి శంకుస్థాపన చేశారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధికి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కాగా, ప్రైవేట్ భవనంలో ఉన్న బాలికల హాస్టల్‌ని డిప్యూటీ సీఎం పరిశీలించారు. వార్డెన్ ఎం.దేవి హాస్టల్ సమస్యలను బూడి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి స్పందించి చీడికాడ హైస్కూల్‌లో మేడపై అదనపు గదులు చాలావరకూ ఖాళీగా ఉన్నాయని, వెంటనే మీ శాఖ అధికారుల ద్వారా జిల్లా అధికారులకు వినతిపత్రం ఇవ్వాలని ఆదేశించారు. ఒక కాపీని తనకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా వరలక్ష్మి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనూరాధ, స్థానిక సర్పంచ్ గాలి రావాలమ్మ, తహసీల్దార్ బీవీ.రాణి, ఎంపీడీవో జయప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

మండలంలోని మామిడిపల్లిలో గురువారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గడపగడపకు మన ప్రభుత్వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, బూరే బాబూరావు, కర్రి సూరినాయుడు, పంచాడ.సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల ఆందోళన

కె.కోటపాడు, జనవరి 25: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు బండారు రామసత్యం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ రమేషబాబుకు అందజేశారు. కె.సరోజిని, జి.అప్పలనాయుడు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పుతో పొగమంచు

మాడుగుల రూరల్, జనవరి 25 : వాతావరణంలో మార్పుతో గురువారం వేకువజాము నుంచి పొగమంచు కమ్మేస్తోంది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పెద్దగా ఎండ లేదు. ఆకాశమంతా మబ్బులు కమ్ముకుని తేలికపాటి జల్లులు పడ్డాయి.

చుక్కపల్లి ఎడ్లకు ప్రథమ స్థానం

దేవరాపల్లి, జనవరి 25: మండలంలోని మరిడిమాంబ గ్రామదేవత తీర్థం సందర్భంగా గురువారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో చుక్కపల్లికి చెందిన అద్దెపల్లి పాలవెల్లి ఎడ్లు ప్రథమ స్థానం సాధించాయి. చుక్కపల్లికి చెందిన మురకుతి హరికృష్ణ ఎడ్లకు రెండో స్థానం, నర్సయ్యపేట ముమ్మన రామకృష్ణ ఎడ్లకు మూడో స్థానం సాధించాయి. విజేతలకు బహుమతులను కర్రి సత్యం, సూరినాయుడు, బాబూరావు, సింహాచలంనాయుడు అందజేశారు.

బీసీలపై సీఎం జగన్‌కు కపట ప్రేమ

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



బీసీ సదస్సులో మాట్లాడుతున్న పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, జనవరి 25: రాష్ట్రంలో బీసీ కులాలపై సీఎం జగన్ కపట ప్రేమను కనబరుస్తున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విమర్శించారు. గురువారం అంభేరుపురంలో నిర్వహించిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీల సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచన ఏమాత్రం లేదన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్ పరిగణిస్తున్నారని, అందువల్లే బీసీ కార్పొరేషన్లకు నిధులు, విధులు లేకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చివేశారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో బీసీలను అన్ని విధాలుగా అణగదొక్కుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో ఆయన సొంత సామాజికవర్గం తప్పితే ఇతర సామాజికవర్గాలకు ప్రాధాన్యత లేదని, కీలకమైన రంగాల్లో సీఎం సొంత సామాజికవర్గం వారినే నియమించుకుంటున్నారన్నారు. సమాజంలో బీసీల కోసం అనుక్షణం పరితపించే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కుఒక్క అవకాశం కల్పించాలని, జనసేన, టీడీపీ అధికారంలోనికి వస్తే బీసీలకు రాజ్యాధికారం వచ్చినట్టవుతుందన్నారు. ఈ సదస్సులో జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, అల్లం రామప్పారావు, కర్రి రమేష్, బలిజ మహరాజు., వీరమహిళలు నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీలంతా కష్టపడి టీడీపీని అధికారంలోకి తెద్దాం : పీవీజీ కుమార్



జయహో బీసీ ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

కె.కోటపాడు, జనవరి 25: బీసీలంతా కష్టపడి తెలుగుదేశం ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. కె.కోటపాడులో జయహో బీసీ కార్యక్రమం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్ల అన్నీ నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తానని ప్రకటించి, ఆ ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, కనిరెడ్డి అప్పలనాయుడు, కర్రి నాయుడు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరోమారు నన్ను గెలిపించండి : ధర్మశ్రీ



ఇంటింటికీ కొళాయిలను ప్రారంభిస్తున్న ధర్మశ్రీ

చోడవరం, జనవరి 25: రానున్న ఎన్నికల్లో మరోసారి తనను గెలిపించాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని ఎడ్లవీధిలో ఇంటింటికీ కొళాయిలు, సచివాలయ భవనాన్ని, బాలాజీనగర్‌లోని తాగునీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఇంటింటికీ తాగునీటి కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, డీసీఎంఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పల్లా నరసింగరావు, ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు డీవీ ఆర్, సర్పంచ్ బండి నూకాలమ్మ, స్థానిక నాయకులు ఓరుగంటి నెహ్రూ, పీఆర్ డీఈఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శివకృష్ణ, ఏఈ కనకమ్మ, పంచాయతీ ఈవో నారాయణరావు పాల్గొన్నారు.